క్లుప్తంగా

నేడు రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశం

వెల్దండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11:00 గంటలకు రేషన్‌డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌షాపుల ద్వారా ఏప్రిల్ నెల నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల రేషన్ డీలర్లు విధిగా హాజరుకావాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

తాడూరు: మండలంలోని ఐతోలు ప్రాథమిక పాఠశాలలో క్లాస్‌మేట్ క్లబ్, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ ఆంజనేయులు, హెచ్‌ఎం అనురాధతో కలిసి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వీరేష్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పూజారి హరికృష్ణశర్మ, నరసింహారెడ్డి, రాఘవేందర్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నాగర్‌కర్నూల్ క్రైం: నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇసుక ట్రాక్టర్లకు నంబర్‌ప్లేట్లు కన్పించే విధంగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నియమనిబంధనలు పాటించాలని పేర్కొన్నారు.

మొక్కల సంరక్షణే ధ్యేయం



చారకొండ: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లి, గోకారంలో మంగళవారం నర్సరీలను పరిశీలించారు. ప్రతి మంగళవారం నిర్వహించే వాటరింగ్ డే సందర్భంగా మొక్కలకు నీరు పట్టారు. వేసవిలో మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి, నిర్వాహకులకు సూచించారు. అనంతరం మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు ఖదీర్, చెన్నకేశవులు తదితరులు ఉన్నారు.

మహాసభలకు తరలివెళ్లిన నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్ర రైతు సంఘం మూడో మహాసభలకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి ఆ సంఘం నాయకులు మంగళవారం తరలివెళ్లారు. రైతు జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్, అధ్యక్షుడు బిజ్జ శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

కోడేరు: మండలంలోని ఎత్తంలో ఉపాధి హామీ పనులను పంచాయతీ కార్యదర్శి రమేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎండాకాలంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు పనులు చేయాలని సూచించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

బల్మూర్: మండల కేంద్రంలో మంగళవారం నాగర్‌కర్నూల్ డీటీఎఫ్ ఎస్‌ఐ అరుణ ఆధ్వర్యంలో సారా విక్రయకేంద్రాలపై దాడులు నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన పట్టపర్ల నర్సింహాగౌడ్, పట్టపర్ల అరుణ నుంచి నాలుగు లీటర్ల చొప్పున సారాను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు అచ్చంపేట ఎక్సైజ్ ఎస్‌ఐ సతీష్ తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం కోసం రేషన్‌కార్డును తొలగించాలని తహసీల్దార్ జేకే మోహన్‌కు మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు పరశురాముడు వినతిపత్రాన్ని అందజేశారు. రేషన్ కార్డులు లేకపోవడంతో దరఖాస్తు చేసుకునే అవకాశం కోల్పోతున్నారని వివరించారు. నిరుద్యోగులందరికి దరఖాస్తు చేసుకునే విధంగా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మేకల శివ ప్రవీణ్ యదవ్, తిర్మల్ యాదవ్, సుధాకర్ రావు, శ్రీకాంత్, గుండాల శివ, కృష్ణారావు, శేఖర్ మల్లేష్, అశోక్, రాజు, పర్వతాలు పాల్గొన్నారు.

ఇద్దరికి రిమాండ్

లింగాల: హోలీ పండుగ రోజు మండల కేంద్రంలోని ఓ చికెన్ షాపు దగ్గర జరిగిన ఘర్షణకు సంబంధించి మంగళవారం ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన సాయికుమార్, అజయ్ అనే వ్యక్తులను కల్వకుర్తి కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్‌ఐ పేర్కొన్నారు.

మండుతున్న ఎండలు

- నిర్మానుష్యంగా రోడ్లు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



కల్వకుర్తి టౌన్: వేసవికాలం ప్రారంభంలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఎండ వేడిని తట్టుకోలేక ప్రజలు తల్లడిల్లుతున్నారు. భానుడి భగభగలను తట్టుకోలేక పనులను వాయిదా వేసుకుంటున్నారు. ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు వరకు నమోదు అవుతున్నాయి. తలకు ఎండ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నా, పెరిగిన ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

వృద్ధులు, చిన్నారులపై ప్రభావం..

వృద్ధులలో దీర్ఘకాలిక వ్యాధుల ప్రభావం కారణంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటం వల్ల డీహైడ్రేషన్ అయ్యే అవకాశం ఉంది. దీర్ఘకాలిక వ్యాధులపై మరింత ప్రభావాన్ని చూపే అవకాశం ఉంటుంది. తరుచుగా ద్రవ పదార్థాలు తీసుకుంటు ఉండాలి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. చిన్నారులు ఐస్‌క్రీమ్‌లు, కుల్ఫీలు, ఇతర శీతల పానీయాలను దూరంగా ఉంచాలని వివరించారు.

జాగ్రత్తలు పాటించాలి



వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు ఎండకు వెళ్లకుండా చూసుకోవాలి. వడదెబ్బ తగలకుండా ఆస్పత్రిలో అన్ని రకాల చర్యలతో పాటుగా, ఓఆర్‌ఎస్ పాకెట్లను సిద్ధంగా ఉంచాం. వడదెబ్బ తగిలితే వెంటనే దగ్గరలోని ఆస్పత్రులకు తీసుకెళ్లాలి.
– డా.శివరాం, సీహెచ్‌సీ సూపరింటెండెంట్, కల్వకుర్తి

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



తిమ్మాజిపేట: సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అప్పాజిపల్లి గ్రామ సమీపంలో వరి పంటను వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఆశిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఫ్యాక్టో కంపెనీ అధికారి హన్మంతు, ఏఈఓ, పలువురు రైతులు పాల్గొన్నారు.

పాడి పశువులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

పెద్దకొత్తపల్లి: వేసవికాలంలో పాడి పశువులపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాజేందర్‌నగర్ శాస్త్రవేత్త బాలాజీ నాయక్ సూచించారు. పెద్దకారుపాముల రైతువేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీలో ఆయన మాట్లాడుతూ పచ్చిగ్రాసం అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వేసవిలో పాడిపశువులు, గేదెలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా మామిడి తోటల్లో పాటించవలసిన మెళకువలను డాక్టర్ జే శంకర్‌స్వామి తెలిపారు. వ్యవసాయ అధికారి శిరీషా, ఏఈఓలు, జానకిరామ్, బాలస్వామి, ముజీబ్, రవి, రవిందర్, సుధారాణి, అనిల్, మల్లేష్, వినోద్, రైతులు బాల్‌రెడ్డి, యదగిరి రెడ్డి, దొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మంగళవారం టీఎంఎఫ్ -2025 డైరీని డీఈఓ రమేష్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, గణిత ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కందికొండ శ్రీనివాస్, జిల్లా పరీక్షల విభాగం అధికారి రాజశేఖర్‌రావు, గణిత ఫోరం జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

లింగాల: మండల కేంద్రంలోని గిరిజన బాలికల మినీ గురుకుల పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం, పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఉపాధ్యాయులలాగా వ్యవహరించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో అలరించాయి. కార్యక్రమంలో ఆర్‌సీఓ కల్యాణి, లైజర్ ప్రిన్సిపాల్ గోవర్ధన్, హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

2న మెగా జాబ్ మేళా

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏప్రిల్ 2న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.

పంచాయతీ కార్మికుల అరెస్టు



పెద్దకొత్తపల్లిలో కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పెద్దకొత్తపల్లి: గ్రామ పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా కార్మికులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీసులు మంగళవారం తెల్లవారుజామున పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు బాలస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం అరెస్టులతో తమ పోరాటాన్ని ఆపలేరన్నారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మల్లయ్య, రాముడు, మద్దిలేటి, లక్ష్మి, సరోజ పాల్గొన్నారు.

కోడేరులో..

కోడేరు: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్మికులు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తుండటంతో పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు సాయిబాబు మాట్లాడుతూ ఆరు నెలల నుంచి జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.రాజమౌళి, కృష్ణయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

కొల్లాపూర్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని కోరుతూ బీజేపీ నాయకులు ఆర్డీఓ భన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆయనను కలిశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అర్హులకు రేషన్‌కార్డులు అందించాలని, రాజీవ్ యువ వికాసం స్కీమ్‌ను దరఖాస్తు చేసుకునే ప్రతి ఒక్కరికీ అందించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కాడం శ్రీనివాస్, నాయకులు ధనుంజయ్‌గౌడ్, శ్రీలక్ష్మి, కాశీపురం మహేష్, శ్రీరామ్‌యాదవ్, భాస్కర్, పరమేష్, కల్పనారెడ్డి, భాస్కర్‌గౌడ్, రమేష్, రాజుయాదవ్, భరత్ తదితరులు ఉన్నారు.

అధిక చార్జీలు తీసుకుంటే చర్యలు

పెద్దకొత్తపల్లి: మీ సేవ కేంద్రాలలో ప్రజల నుంచి అధిక చార్జీలు వసులు చేస్తే మీసేవ కేంద్రాలపై చర్యలు తప్పవని తహసీల్దార్ జేకే మోహన్ అన్నారు. మంగళవారం కార్యాలయంలో మీసేవ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్ నాయక్ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

కొల్లాపూర్ రూరల్: హామీల అమలులో ప్రభుత్వం విఫలం అయ్యిందని బీజేపీ మండల అధ్యక్షులు సాయికృష్ణ గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని సింగోటంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పూర్తిగా విఫలం అయ్యిందని విమర్శించారు. రాజీవ్ యువ వికాసం పథకం పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్ మోసాలపై త్వరలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల నిరసన



సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఆశావర్కర్ల అక్రమ అరెస్టులను నిరసిస్తూ మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. వారికి సీఐటీయూ నాయకుల మద్దతు తెలిపారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, బిజినేపల్లి, తాడూరు, పెద్దకొత్తపల్లి, తిమ్మాజిపేట, వెల్దండ, లింగాలలో ఆశాకార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అపరిచితులకు వ్యక్తిగత సమాచారం చెప్పొద్దు

తెలకపల్లి: అపరిచితులకు వ్యక్తిగత సమాచారం చెప్పొద్దని షీ-టీమ్ ఇన్‌చార్జ్ విజయలక్ష్మీ సూచించారు. మంగళవారం మండలంలోని రాకొండ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైన లైంగిక వేధింపులకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. భరోసా కోఆర్డినేటర్ శ్రీలత, పాఠశాల ఇన్‌చార్జ్ ఎస్‌ఓ రజిత, షీ-టీమ్ మెంబర్ వెంకటయ్య, జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

5న విజయోత్సవ ర్యాలీ

అచ్చంపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందిన సందర్భంగా 5న అచ్చంపేట పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పులతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సోట కాశీం తెలిపారు. మంగళవారం పట్టణంలోని బాబుజగ్జీవన్‌రామ్ భవన్‌లో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీం మాట్లాడుతూ బాబుజగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహిస్తునట్లు మాదిగలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఎంఎస్‌ఎఫ్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మహేష్, వెంకటయ్య, రాజమౌళి, శంకర్, సుధాకర్, బాలరాజు, కొండల్, పర్వతాలు, మల్లేష్, ఏకలవ్య పాల్గొన్నారు.

డిపో అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం



కొల్లాపూర్: డిపో అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని డీఎం ఉమాశంకర్ కోరారు. మంగళవారం డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. జనవరి, ఫిబ్రవరి నెలలో అత్యధిక కేఎంపీఎల్, పీకే సాధించిన డ్రైవర్లు, కండక్టర్లకు నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ డిపో అభివృద్ధిలో ఉద్యోగులు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు రత్నమ్మ, వెంకటేశ్వర్లు, నజీర్, గౌసోద్దీన్, బీవీఆర్ రెడ్డి, మల్లేష్ తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

తాడూరు: బాల్య వివాహాలు చేయడం చట్ట విరుద్ధమని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు శ్రీరామ్ ఆర్య అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్స్ స్కీమ్‌పై మంగళవారం మండలంలోని మేడిపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులపై అవగాహన కల్పించారు. 6–14 ఏళ్ల వయసు పిల్లలందరు తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లి చదువుకోవాలన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తునట్లు సమాచారం తెలిస్తే 1098 టోల్ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలపాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం త్యాగరాజుగౌడ్, కృష్ణారెడ్డిలు ఉన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

లింగాల: కరాటేతో ఆత్మరక్షణ సాధ్యమని రామాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పూజారి భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వేసవి కరాటే శిక్షణా తరగతులకు సంబంధించిన ప్రచార సామగ్రిని మంగళవారం ఆయన విడుదల చేసి అందజేశారు. చిన్నారులకు బ్లాక్ బెల్టు మాస్టర్ ముఖేష్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. చిన్నారులు యోగా, ధ్యానం అలవర్చుకోవాలన్నారు. ముక్తార్, శంకర్‌నాయక్, నిరంజనాచారి, మల్లాచారి, బుడ్డయ్య, స్వామి, నసీర్ తదితరులు పాల్గొన్నారు.



మహనీయుల స్ఫూర్తితో పోరాటాలు



మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

కల్వకుర్తి రూరల్: సమాజంలోని కుల వివక్షతపై పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతిఘటన పోరాటాలు చేస్తామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో కేవీపీఎస్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్కైలాబ్‌బాబు హాజరై మాట్లాడారు. ఏప్రిల్ నెలను మహనీయుల మాసంగా పాటించాలన్నారు. ఇప్పటికి గ్రామాల్లో కుల వివక్ష, అంటరానితనం ప్రత్యక్షంగా, పట్టణాలలో పరోక్షంగా కొనసాగుతోందని ఆరోపించారు. దళితులకు గుడి ప్రవేశం లేని గ్రామాలు, బతుకమ్మ ఆడనీయని గ్రామాలు, దసరా సందర్భంగా జమ్మి ఆకు కోయకుండా అడ్డుకునే గ్రామాల ను గుర్తించి ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. రాష్ట్రంలో 128 కుల దురహంకార హత్యలకు గురైన వారికి నివాళులర్పించారు. సంఘం జిల్లా కార్యదర్శి పులిజాల పరశురాములు, జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, అశోక్, మల్లేష్, సుధాకర్, బాలమణి, స్వాతి, చిన్నయ్య, పరమేశ్వరయ్య, చెన్నయ్య తోపాటు సంఘం సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

కల్వకుర్తి రూరల్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా పనిచేస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. మొత్తం కల్వకుర్తి ప్రాంతంలోని 2500 నిరుద్యోగ యువతీ యువకులు పేర్లను నమోదు చేసుకున్నారు. 68 కంపెనీల ప్రతినిధులు జాబ్ మేళా హాజరయ్యారు. 230 మందికి తక్షణమే నియామకం చేసుకుంటూ పత్రాలు జారీ చేశారు. మరో రెండు వందల మందికి ఉపాధి కల్పించే ప్రక్రియ కొనసాగుతోంది. అనంతరం రాఘవేందర్ రెడ్డి మాట్లాడారు. నియోజకవర్గంలో 10వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సుభాషిని, యువకులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తా

పట్టణంలోని కైలాసం గుట్టపై వెలసిన పడమటి భక్త ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. కైలాసం గుట్టకు వచ్చి ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. శేఖర్‌రెడ్డి, మధు, శేఖర్ రెడ్డి, సురేష్ గౌడ్, వీరారెడ్డి, బాలయ్య, అంతయ్య, శ్రీనివాసులు, పలువురు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



మన్ననూర్: కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్ కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ చిత్రపటానికి స్థానిక వివేకానంద చౌరస్తాలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు సైదులు, కృష్ణయ్య, శివాజీ, నారాయణ, రాజకీయ నాయకులు వెంకటరమణ, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రాజారాం, రమేష్, శంకరయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

తెలకపల్లి: సబ్సిడీపై అందజేస్తున్న వ్యవసాయ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ మండల అధికారి నర్మద మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనరల్ క్యాటగిరికి 9, ఎస్సీలకు 3, ఎస్టీకు 4 నాలుగు యూనిట్లు ఉన్నాయని వివరించారు. రాయితీ పొందేందుకు మహిళా రైతు పేరు మీద భూమి ఉండాలని పేర్కొన్నారు.

రూ.15.30 లక్షలకు తైబజారు వేలం

కొల్లాపూర్: మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాసన్ సమక్షంలో మంగళవారం తైబజార్‌కు వేలంపాట నిర్వహించారు. ఏడుగురు వ్యక్తులు వేలంలో పాల్గొన్నారు. రూ.15.30 లక్షలకు ఎండీ చాంద్‌పాషా పాట పాడి వేలంలో తైబజార్‌ను దక్కించుకున్నాడు. ఒక సంవత్సరం పాటు ఆయన తైబజారు వసూలు చేస్తారని కమిషనర్ తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత



అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం ఆర్డీఓ మాధవి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, మల్లేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చారకొండ: మండల కేంద్రంలోని సిర్సనగండ్ల, కమాల్‌పూర్ గ్రామాల సంబంధించిన 9 మందికి మంగళవారం అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో ఆర్‌డీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను ఆర్‌డీఓ మాధవి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జూనియర్ అసిస్టెంట్ శ్రీను, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జైపాల్, నాయకులు శివ, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజేందర్

కల్వకుర్తి రూరల్: మండలంలోని తోటపల్లి పాఠశాలలో పనిచేస్తున్న పోరెడ్డి రాజేందర్ సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్ రాష్ట్ర కార్యదర్శి అంజయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడిగా రఘురామారావు ఎన్నుకున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కల్వకుర్తి టౌన్: టెన్నికాయిట్ సీనియర్స్ విభాగంలో పట్టణంలోని బీసీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టుగా ప్రిన్సిపాల్ డా. నాగమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిస్సాలోని భువనేశ్వర్‌లో బుధవారం నుంచి నిర్వహించే పోటీల్లో పాల్గొంటారిని పేర్కొన్నారు.

ధ్రువపత్రాలు జారీ చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: కుల, ఆదాయ ధ్రువపత్రాలను వెంటనే జారీ చేయాలని కోరుతూ మంగళవారం డీఐఎఫ్‌ఐ నాయకులు తహసీల్దార్ తబితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగపూర్ మధు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీఐఎఫ్‌ఐ నాయకులు సరేష్, మల్లేష్, బాలు, అంజి, శివ తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా

చారకొండ: లారీ అదుపుతప్పి బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలైన ఘటన మండలంలోని మర్రిపల్లి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దేవరకొండ నుంచి కల్వకుర్తి వైపు ప్లాస్టిక్ సీడ్స్ లోడ్‌తో వేగంగా వెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి పల్టీ కొట్టింది. లారీలో ఉన్న సీడ్స్ సంచులు కిందపడ్డాయి. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిని డ్రైవర్‌న్ స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శంషోద్దిన్ తెలిపారు.

విధులు బహిష్కరణ



కల్వకుర్తి టౌన్: హైదరాబాద్‌లో లాయర్ ఇజ్రాయిల్ హత్యను నిరసిస్తూ మంగళవారం కల్వకుర్తి బార్ అసోసియేషన్ సభ్యులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కోర్టు సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించారు. న్యాయవాదుల ప్రొటెక్షన్ బిల్లును తీసుకురావాలని డిమాండ్ చేశారు. నిరసనలో లాయర్లు వెంకట్‌రెడ్డి, లక్ష్మీ నారాయణ, వెంకట్‌గౌడ్, అమరేందర్, కృష్ణయ్య, జంగయ్య, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా శంకర్‌గౌడ్

కొల్లాపూర్: తెలంగాణ యోగా టీచర్స్ కోఆర్డినేషన్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా కొల్లాపూర్‌కు చెందిన పతంజలి శంకర్‌గౌడ్ నియమితులయ్యారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా స్థాయి యోగా టీచర్స్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని జిల్లాలకు అధ్యక్షులను నియమించారు.

కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే బీరం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండం గ్రామ సమీపంలో పెద్ద వాగుపై నిర్మించిన హైలెవల్ బ్రిడ్జి పూర్తి అయిన సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి చిత్రపటానికి నార్లాపూర్, ముక్కిడిగుండం గ్రామాల ప్రజలు బీఆర్‌ఎస్ నాయకులు పాలాభిషకం చేశారు. బ్రిడ్జి నిర్మాణానికి మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీ రాములు రూ. 9 కోట్లు నిధులు మంజూరు చేయించారని గ్రామస్తులు పేర్కొన్నారు. అప్పటి నుంచి పనులు పూర్తయ్యేలా వారు ఎంతో కృషి చేశారని కొనియాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు రామచంద్రం, బాల్ నాయక్, మాజీ సర్పంచ్ దశరథం, శ్రీకాంత్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.